GV MALL
shop & celebrate
TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 91 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/-
సోమవారం 04 నవంబర్ 2024
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# పిఠాపురం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్: డిప్యూటీ సీఎం పవన్

**పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.**



గొల్లప్రోలు, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ను ప్రారంభించి.. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్లు, ఇతర ఉపకరణాలు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పిఠాపురాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని.. అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ తయారవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా చేస్తానని చెప్పారు. ప్రధాన రహదారులతో గ్రామీణ రహదారుల అనుసంధానం చేస్తామన్నారు. రోడ్లపై చెత్త కనిపించకూడదన్నారు. పాఠశాల పిల్లలకు మైదానాలు బాగుండాలని.. తాగేందుకు పరిశుభ్రమైన నీరు ఉండాలని పవన్ అన్నారు.

# సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం

**ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 39వ అథారిటీ సమావేశం జరిగింది.**



అమరావతి, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీఏ 39వ అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నిలిచిపోయిన అమరావతి రాజధాని నిర్మాణాలపై ఏర్పాటైన టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించారు. 2019లో వైకాపా ప్రభుత్వం పనులు నిలిపివేయడంతో వచ్చిన ఇబ్బందులను అధ్యయనం చేసి టెక్నికల్ కమిటీ నివేదిక ఇచ్చింది. రాజధాని నిర్మాణానికి టెండర్లు పొందిన సంస్థలతో వివాదాలు పరిష్కరించేందుకు, మళ్లీ పనులు ప్రారంభించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కమిటీ పలు సూచనలు చేసింది. కమిటీ సూచనలు, అదనపు ఆర్థిక భారం వంటి అంశాలపై సీఆర్డీఏ సమావేశంలో చర్చించారు.

# మూసీ పరివాహక ప్రాంతాల్లో 8న సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర!

**ఈ నెల 8న తన పుట్టిన రోజు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు.**



హైదరాబాద్, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): ఈ నెల 8న తన పుట్టినరోజు సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి క్షేత్రంలో పూజలు చేయనున్నారు. అదే రోజు మూసీ పరివాహక ప్రాంతాల్లో పాదయాత్ర చేసే అవకాశం ఉంది. భువనగిరి నుంచి వలిగొండ వైపు పాదయాత్ర చేయనున్నారని సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల పైపులైన్లకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డితో ఉమ్మడి నల్గొండ జిల్లా కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. మంత్రి కోమటిరెడ్డితో ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులు చర్చించారు. భట్టి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం నిధుల సమీకరణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన దీన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధరాబాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఖజానాకు అదనపు నిధుల సమీకరణపై సమావేశంలో చర్చించారు. సంబంధిత శాఖల అధికారులతో ఉపసంఘం చర్చలు సాగాయి.

## ప్రపంచ ముఖ్య ఐదు నగరాల్లో ఒకటిగా అమరావతి: మంత్రి నారాయణ

**గత ప్రభుత్వం రాజధాని పేరుతో మూడుముక్కలాట ఆడిందని మంత్రి నారాయణ అన్నారు.**

అమరావతి, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): గత ప్రభుత్వం రాజధాని పేరుతో మూడుముక్కలాట ఆడిందని మంత్రి నారాయణ అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధాని అమరావతి పనులను వేగవంతం చేశామని చెప్పారు. ప్రపంచంలోని ఐదు ముఖ్యమైన నగరాల్లో ఒకటిగా అమరావతి నిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి నారాయణ మాట్లాడారు."జులై 24న చీఫ్ ఇంజినీర్లతో సాంకేతిక కమిటీ వేశాం. 2014-19 సమయంలో టెండర్ ఇచ్చిన పనుల గడువు ముగిసింది. పనులకు సంబంధించి చీఫ్ ఇంజినీర్ల కమిటీ అక్టోబరు 29న నివేదిక ఇచ్చింది. అన్ని పనులకు సంబంధించి డిసెంబర్ చివరిలోగా టెండర్లు పిలవాలని ఆదేశించాం. మూడేళ్లలో పనులు పూర్తి కావాలని సీఎం ఆదేశించారు. ప్రపంచ బ్యాంకు రూ.15వేల కోట్ల రుణం ఇస్తుంది. మంత్రులు, జడ్జిలు, ఇతర బంగ్లాలకు రూ.41 వేల కోట్లకు టెండర్లు పిలుస్తాం. రూ.30వేల కోట్ల టెండర్లకు సంబంధించి పనులు మొదలయ్యాయి. నీరుకొండ, కృష్ణాయపాలెం, శాఖమూరి వద్ద రిజర్వాయర్ నిర్మాణం చేపడతాం. ఉండవల్లి వద్ద 7,350 క్యూసెక్కులు పంపింగ్ చేసేలా ఏర్పాట్లు చేస్తాం. ఇంజినీర్ల కమిటీ నివేదిక ప్రకారం సీఆర్డీఏ ముందుకెళ్తుంది" అని నారాయణ తెలిపారు.




## 2028లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయం: బండి సంజయ్



**తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్లోని 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా ఎన్నారైలతో ఆయన భేటీ అయ్యారు.**

హైదరాబాద్, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్లయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. యూఎస్కు చెందిన 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ భాజపా' ఎస్ఆర్ఎ నేతలతో ఆయన దృశ్యమాధ్యమం ద్వారా సమావేశమయ్యారు. అతి తక్కువ కాలంలో కాంగ్రెస్పై తీవ్ర వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో సీఎం హామీలకు విలువ లేకుండా పోయిందన్నారు. దక్షిణాదికి అన్యాయం పేరుతో ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందని, మీడియా ప్రచారం తప్ప ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. భారాస పనైపోయిందని, ఆ పార్టీలో క్యాడర్ లేరన్నారు. ఆ పార్టీలో కొంతమంది నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో భాజపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదాయం కోసం కాకుండా ఆలయాల్లో ప్రజలకు సేవలందిస్తామని, హిందూ ధర్మం, ప్రజల ఆలోచనలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కనీసం ఐదుగురు విదేశీయులను భారత్లో పర్యటించేలా కృషి చేయాలని ఎన్నారైలకు ఆయన సూచించారు. దేశాభివృద్ధి కోసం తెలంగాణాలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.

### మాజీ సర్పంచ్ అరెస్టు దుర్మార్గం

రాష్ట్రంలో మాజీ సర్పంచ్ల అరెస్టు దుర్మార్గమని బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్లు అప్పుల పాలవడానికి కారకులు భారాస, కాంగ్రెస్ పార్టీలేనన్నారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులన్నీ చెల్లిస్తామని చెప్పిన కాంగ్రెస్.. మాట తప్పిందని విమర్శించారు. ఏడాది కాలంగా పెండింగ్లో ఉన్న బిల్లులను ఇవ్వాలని విన్నవించినా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యను పరిష్కరించకుండా పోలీసులతో అణగదొక్కాలని చూస్తారా? అని మండిపడ్డారు. కాంగ్రెస్, భారాస పార్టీలకు మాజీ సర్పంచ్ కుటుంబాల ఉసురు తగులుతుందన్నారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# 24 గంటల ఉచిత కరెంట్..

## కేసీఆర్ సాధించిన ఘనత : మాజీ మంత్రి హరీశ్ రావు

**కాంగ్రెస్ పార్టీ 24 గంటల కరెంట్ విషయంలో దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీష్ రావు ధ్వజమెత్తారు.**



హైదరాబాద్, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): 24 గంటల పాటు కరెంట్ విషయంలో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని మాజీ మంత్రి హరీశ్రావు ధ్వజమెత్తారు. 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అన్నట్లుగా జాతీయ కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని ఎద్దేవా చేశారు. దేశంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ను అందించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది భారాస, కేసీఆరేనని తెలిపారు. కానీ ఆ ఘనత కూడా తమదేనంటూ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. గతంలో రైతులకు 24 గంటల ఉచిత కరెంటు దండగ అని, మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రైతు వ్యతిరేక వైఖరిని ప్రకటించిన చరిత్ర కాంగ్రెస్తోపాటు సీఎం రేవంత్రెడ్డిదని మండిపడ్డారు. ఇప్పుడేమో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ సాధించిన ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకుంటూ దేశవ్యాప్తంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించుకునే ముఖం లేక, తెలంగాణలో భారాస సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇది కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి, మోసపూరిత విధానానికి మరోనిదర్శమని పేర్కొన్నారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# పోరుబాట పట్టిన మాజీ సర్పంచులు.. ఎక్కడికక్కడ అరెస్టులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చారు.



హైదరాబాద్, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): పెండింగ్ బిల్లులు విడుదల చేయాలంటూ తెలంగాణలో మాజీ సర్పంచులు పోరుబాట పట్టారు. సీఎం రేవంత్రెడ్డికి వినతి పత్రం ఇచ్చేందుకు హైదరాబాద్ చేరుకుని ఓ హోటల్లో సమావేశమయ్యారు. అనంతరం హోటల్ బయటకు వచ్చిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన వారిని ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేశారు.

### మాజీ సర్పంచుల కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణం: కేటీఆర్

పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. పల్లె ప్రగతి పేరుతో తాము చేపట్టిన కార్యక్రమానికి తూట్లు పొడిచారని కేటీఆర్ ఆరోపించారు.

### ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన వారిని అరెస్టు చేయడమేనా?: హరీశ్రా రావు

మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. సీఎంను కలిసేందుకు వచ్చిన వారిని అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. గ్రా మాభివృద్ధి కోసం ఖర్చు చేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా అని ప్రశ్నించారు. వారంతా అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టు పెట్టారన్నారు. ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచులను అరెస్టు చేయడమేనా? అని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు.. సర్పంచులకు చెల్లించరా? అని నిలదీశారు. మాజీ సర్పంచులను వెంటనే విడుదల చేయాలని.. బిల్లులు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఫ్లెక్సీలు కడుతుండగా కరెంట్ షాక్.. నలుగురు యువకుల మృతి

తూర్పుగోదావరిలో విషాదం చోటుచేసుకుంది. విద్యుత్ షాక్ తో నలుగురు మృతి చెందారు.



ఉండ్రాజవరం, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతంతో నలుగురు మృతిచెందారు. ఒకరికి తీవ్రగాయాలు కాగా అతడి పరిస్థితి విషమంగా ఉంది. పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీలు కడుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను బొల్లా వీర్రాజు, పామర్తి నాగేంద్ర, మారిశెట్టి మణికంఠ, కాసగాని కృష్ణగా గుర్తించారు. మృతదేహాలను తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన కోమటి అనంతరావును చికిత్స నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణకు సంబంధించి ఏడాదిన్నరగా రెండు వర్గాల మధ్య వివాదం నెలకొంది. ఇటీవల ఇరుపక్షాలతో చర్చించి కొవ్వూరు సబ్ కలెక్టర్ రాణి సుస్మిత అనుమతి ఇచ్చారు. ఈ ఉదయం సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా విగ్రహం ఆవిష్కరించాల్సి ఉంది. ఈలోగా దుర్ఘటన చోటు చేసుకుంది.

### విద్యుదాఘాతం ఘటనపై సీఎం చంద్రబాబు విచారం

విద్యుదాఘాతం ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో నలుగురు మృతి చెందడం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్ష చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ సానుభూతి ప్రకటించారు. వారిని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి: కందుల దుర్గేశ్

మృతుల కుటుంబాలను మంత్రి కందుల దుర్గేశ్ పరామర్శించారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వారితో మాట్లాడారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# ఐపీఎల్ తరహాలో ఏపీఎల్: కేశినేని చిన్ని

త్వరలోనే మూలపాడు క్రికెట్ స్టేడియంలోని రెండో గ్రౌండ్ అందుబాటులోకి వస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) తెలిపారు.



మూలపాడు, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): త్వరలోనే మూలపాడు క్రికెట్ స్టేడియంలోని రెండో గ్రౌండ్ అందుబాటులోకి వస్తుందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని (శివనాథ్) తెలిపారు. ఇక్కడి మైదానాన్ని సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. మూలపాడులో సెంటర్ ఫర్ ఎక్సెలెన్స్ నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 175 నియోజకవర్గాల్లో క్రికెట్ గ్రౌండ్లు ఏర్పాటుచేయడమే లక్ష్యమన్నారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఐపీఎల్ తరహాలో ఏపీఎల్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఏసీఏ తరపున మూలపాడులో ఏడాదిలోపు క్రికెట్ అకాడమీ వస్తుందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రికెట్ క్రీడాకారుల వెలికితీతకు కృషి చేస్తున్నట్లు వివరించారు. మూలపాడుకు అన్నీ అనుకూలిస్తే గోల్ఫ్ కోర్స్ వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలో మంగళగిరి, మూలపాడులో రెండు క్రికెట్ స్టేడియాలు ఉండటం ఆనందంగా ఉందని చెప్పారు. ఈ రెండు స్టేడియాలను ఏడాదిలోపు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఎంపీ కేశినేని చిన్ని స్పష్టంచేశారు.

# హైదరాబాద్ మెట్రో లో సాంకేతిక సమస్య

మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి.



హైదరాబాద్: మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎల్బీనగర్-మియాపూర్ మెట్రో మార్గంలో సాంకేతిక సమస్య కారణంగా రైళ్లు నెమ్మదిగా నడుస్తున్నాయి. విద్యుత్ ఫీడర్ ఛానల్లో సాంకేతిక సమస్య వచ్చిందని మెట్రో అధికారులు తెలిపారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. రైళ్ల ఆలస్యంతో స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగింది.

# జగన్ రాయలసీమ బిడ్డ అని చెబుతూనే

## నీటి పారుదల శాఖను పట్టించుకోలేదు: మంత్రి నిమ్మల

ఉల్లి రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగకూడదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.




కర్నూలు, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): ఉల్లి రైతుకు ఒక్క రూపాయి కూడా నష్టం జరగకూడదని మంత్రి నిమ్మల రామా నాయుడు అన్నారు. వినియోగదారుడికి భారం కాకుండా మేలు జరిగేలా ఎన్డీయే కూటమి పని చేస్తోందని చెప్పారు. ఆయన మంత్రి టీజీ భరత్తో తో కలిసి కర్నూలులో ఉల్లి మార్కెట్ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ-నామ్ బిడ్డింగ్ పని చేయని సందర్భంగా వెంటనే ఆఫ్లైన్లో నమోదు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. గతేడాది అక్టోబర్లో మార్కెట్కు 52 వేల టన్నుల ఉల్లి వస్తే.. ప్రస్తుతం దానికి నాలుగు రెట్లు అధికంగా 2.5 లక్షల టన్నుల ఉల్లి వచ్చిందన్నారు. దిగుబడి ఇంత అధికంగా వచ్చినా.. వైకాపా పాలనలో ధరల కంటే ఎక్కువధరను రైతులు పొందారని వివరించారు. గత ప్రభుత్వంలో హార్టికల్చర్, డ్రిప్ ఇరిగేషన్ వంటిఅన్నింటినీ గాలికొదిలేశారని విమర్శించారు. జగన్ రాయలసీమ బిడ్డ అని చెబుతూనే నీటిపారుదల శాఖను పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. దళారులు సిండికేట్ కాకుండా కోదువ-మారులో కూడా ఉల్లి మార్కెట్ను అభివృద్ధి చేస్తున్నట్లు నిమ్మల రామానాయుడు చెప్పారు.

# యురేనియం తవ్వకాలు రద్దు చేయాలని

## ఆందోళన.. నిలిచిన వాహనాల రాకపోకలు

కర్నూలు జిల్లా దేవనకొండ మండలం ఈదుల దేవరకొండ స్టేజ్ వద్ద రైతులు, ప్రజలు ఆందోళన చేపట్టారు.



దేవనకొండ, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు జిల్లా దేవనకొండ మండలం ఈదుల దేవరకొండ స్టేజ్ వద్ద రైతులు, ప్రజలు ఆందోళన చేపట్టారు. కప్పట్రాళ్ల రక్షిత అడవుల్లో యురేనియం తవ్వకాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కర్నూలు-బళ్లారి రహదారి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు కప్పట్రాళ్లలో అధికారుల సమావేశాన్ని రైతులు, ప్రజలు బహిష్కరించారు. యురేనియం తవ్వకాలు చేపడితే నష్టపోతామంటూ వివిధ గ్రామాల ప్రజలు కొన్నిరోజులుగా వరుస ఆందోళనలు చేపడుతున్నారు.

# తిరుమలకు జగన్ స్టిక్కర్ తో వచ్చిన మాజీ మంత్రి అంబటిరాంబాబు

వైకాపా అధ్యక్షుడు జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్ తో మాజీ మంత్రి అంబటి రాంబాబు తిరుమలకు రావడం చర్చనీయాంశమైంది.



తిరుమల, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): వైకాపా అధ్యక్షుడు జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్ తో మాజీ మంత్రి అంబటి రాంబాబు తిరుమలకు రావడం చర్చనీయాంశమైంది. రాజకీయ పార్టీల చిహ్నాలు, జెండాలు, స్టిక్కర్లతో శ్రీవారి దర్శనానికి రావడం తితిదే నిబంధనలకు విరుద్ధం. అయినా అంబటి రాంబాబు తన చొక్కాపై జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్తో వచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయన అలా రావడంపై పలువురు చర్చించుకున్నారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ వచ్చేసింది.. నవంబరు 5 నుంచి దరఖాస్తుల స్వీకరణ

తెలంగాణలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్ విడుదలైంది.



హైదరాబాద్, నవంబర్, 04 (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. నవంబర్ 5 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం కల్పించారు. 2025 జనవరి 1 నుంచి 20వ తేదీ వరకు ఆన్లైన్లో కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహిస్తామని ప్రభుత్వం గతంలో పేర్కొంది. ఈ సంవత్సరం మే 20వ తేదీ నుంచి జూన్ 2 వరకు ఆన్లైన్ పరీక్షలు నిర్వహించిన సంగతి తెలిసిందే. రెండో టెట్కు నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసి జనవరిలో పరీక్షలు జరుపుతామని గత ఆగస్టులో జాబ్ క్యాలెండర్ విడుదల సమయంలో ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. టెట్ పేపర్-1కు డీఈడీ, పేపర్-2కు బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్గా పదోన్నతి పొందేందుకు టెట్ అర్హత ఉండాలని చెబుతుండటంతో వేల మంది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా పరీక్షకు హాజరుకానున్నారు. టెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు తొమ్మిది సార్లు పరీక్షలు నిర్వహించగా... జనవరిలో పదోసారి జరగనుంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత మే పరీక్షతో కలుపుకొని ఆరుసార్లు పరీక్షలు జరిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రెండోసారి టెట్ను నిర్వహిస్తుండటం విశేషం.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


జమ్నాలాల్ బజాజ్


శకుంతలా దేవి


యునెస్కో


రాడ్ మార్ష్


సుహాస్ గోపీనాథ్


ఇత్జాక్ రబీన్


అర్జా జనార్ధనరావు

- **1888** : వ్యాపారవేత్త, భారత స్వాతంత్ర్య సమరయోధుడు జమ్నాలాల్ బజాజ్ జననం (మ.1942).
- **1929** : ప్రపంచ గణిత, ఖగోళ, జ్యోతిష శాస్త్రవేత్త శకుంతలా దేవి జననం (మ.2013). (చిత్రంలో)
- **1946** : యునెస్కో (యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్) ఏర్పాటయింది.
- **1947** : ఆస్ట్రేలియాకు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు రాడ్ మార్ష్ జననం.
- **1986** : భారతీయ వ్యాపారి, ఐటి బహుళ జాతి సంస్థ అయిన గ్లోబల్స్ సంస్థాపకుడు సుహాస్ గోపీనాథ్ జననం.
- **1995** : ఇజ్రాయిల్ ప్రధాని ఇత్జాక్ రబీన్ హతం (జ.1922).
- **2007** : తెలుగు నాటక, సినిమా నటుడు అర్జా జనార్ధనరావు మరణం (జ.1926).

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

## ఆ వైట్ బాల్ క్రికెట్ అప్రోచ్.. టెస్టులకు పనికిరాదు..: రోహిత్కు డీకే సూచన

**న్యూజిలాండ్ పై టెస్టు సిరీస్లోలో వైట్ వాష్ అయిన టీమ్ ఇండియా పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**



సొంతగడ్డపై తొలిసారిగా టెస్టు సిరీస్ను 0-3 తేడాతో అవమానకర రీతిలో ఓడటంతో టీమ్ ఇండియాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వేళ్లన్నీ సారథి రోహిత్ శర్మ వైపే చూపిస్తున్నాయి. ఈ సిరీస్లో పేలవమైన ప్రదర్శనతో తీవ్రంగా నిరాశపరిచాడు అతడు. గత కొంతకాలంగా టెస్టుల్లో ఫామ్ లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో రోహిత్ ఎక్కడ తప్పులు చేస్తున్నాడో అతడి సహచరుడు దినేశ్ కార్తిక్ వివరించాడు. పలు సలహాలూ ఇచ్చాడు. రోహిత్ టెస్టుల్లో గత 10 ఇన్నింగ్స్ ల్లో చేసిన పరుగులు 133 మాత్రమే. దూకుడుగా ఆడేందుకు వెళ్లి వికెట్ సమర్పించుకుంటున్నాడు. న్యూజిలాండ్తో జరిగిన ఆఖరి టెస్టు రెండో ఇన్నింగ్స్ లో పెద్ద షాట్ ఆడేందుకు ప్రయత్నించి పెవిలియన్ చేరాడు. దీనిపై డీకే స్పందిస్తూ.. ఇలాంటి అప్రోచ్ వైట్ బాల్ క్రికెట్లో ఆరంభంలో అతడికి గొప్ప ఫలితాలిచ్చిందేమో కానీ.. టెస్టుల్లో తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు. ఆ కంఫర్ట్ జోన్ నుంచి రోహిత్ బయటకు రావాలని.. టెస్టుల్లో పెద్ద షాట్లు ఆడకుండా ఉండాలని కార్తిక్ పేర్కొన్నాడు. "టెస్టుల్లో ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దూకుడుగా ఆడాలని రోహిత్ భావిస్తున్నాడని నేను అనుకుంటున్నా. వైట్ బాల్ క్రికెట్లో ఆడిన అప్రోచ్ టెస్టు క్రికెట్కు పనిచేయదు. కొద్దిగా ఒత్తిడికి గురికాగానే ప్రమాదకరమైన అటాకింగ్ షాట్కు ప్రయత్నిస్తున్నాడు" అని డీకే అన్నాడు. ఇక రోహిత్ తన టెక్నిక్ను నమ్ముకోవాలని.. భారీ షాట్లకు వెళ్లకుండా మరింత బ్యాలెన్స్ అప్రోచ్ ఆడాలని సూచించాడు. "రోహిత్ శర్మ ఓపెనర్గా తన బాధ్యతలను స్వీకరించినప్పుడు గతంలో ఏం చేశాడో ఇప్పుడు అలా చేయడం లేదు. అప్పుడు అతడు తన టెక్నిక్ను విశ్వసించేవాడు" అని డీకే తెలిపాడు.

### ఇక వారి కెరీర్కు ముగింపే..: ఆకాశ్ చోప్రా

ఇక స్వదేశంలో జరిగిన గత రెండు టెస్టు సిరీస్ ల్లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ పేలవ ప్రదర్శనలపై మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా మండిపడ్డారు. వారి కెరీర్ ముగింపునకు ఇదే నాంది అని పేర్కొన్నాడు. హోమ్ సిరీస్ ల్లో గణాంకాలు వారిని ఆందోళనకు గురిచేయకపోతే.. వారు కళ్లకు గంతలు కట్టుకునైనా ఉండాలి లేదా అటు వైపు చూడకూడదనుకొనైనా ఉండాలి అని విమర్శించాడు.

## వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పిన కిరణ్ అబ్బవరం..

**'క' సినిమాను ఆదరించినందుకు కిరణ్ అబ్బవరం ధన్యవాదాలు తెలిపారు.**

**ఓవర్సీస్ ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతూ వీడియో విడుదల చేశారు.**



కిరణ్ అబ్బవరం హీరోగా సుజీత్ - సందీప్ సంయుక్తంగా రూపొందించిన సినిమా 'క'. తాజాగా విడుదలైన ఈ చిత్రం మంచి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇండియాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందన రావడంతో అభిమానులకు కిరణ్ ధన్యవాదాలు తెలిపారు. ఓవర్సీస్ లోనూ ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కిరణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'ఈ సినిమాకు ఓవర్సీస్ లోనూ స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఎంతోమంది ఆదరించివిజయాన్ని అందించారు. నాకు ఎప్పుడూ రానన్ని ఫోన్లు, మెసేజ్ లు ఇప్పుడు వస్తున్నాయి. ఫ్రెండ్స్,ఫ్యామిలీ నుంచి ప్రశంసలు వస్తున్నాయి. అమెరికాలో ఉన్న వాళ్లు ఫోన్ చేసి సినిమా బాగుందని చెబుతుంటే సంతోషంగా ఉంది. క్లైమాక్స్ చాలా ఆసక్తిగా ఉందని అంటున్నారు. ఇంత మంచి సక్సెస్ ను ఇచ్చినందుకు అందరికీ ధన్యవాదాలు. అక్కడికి వచ్చి మీ అందరినీ ఎప్పుడెప్పుడు చూస్తానా అనిపిస్తోంది' అంటూ కిరణ్ అబ్బవరం వీడియోను విడుదల చేశారు. సస్పెన్స్ థ్రిల్లర్గా 'క' తెరకెక్కింది. సుజీత్ - సందీప్ సంయుక్తంగా దీనిని రూపొందించారు. తన్వీ రామ్, నయన్ సారిక, అచ్యుత్కుమార్, రెడిన్ కింగ్స్ కీలకపాత్రలు పోషించారు. దీపావళి కానుకగా ఈ సినిమా విడుదలైంది. ప్రీమియర్స్లో మొదట 82 స్క్రీన్స్లో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. తర్వాత పబ్లిక్ డిమాండ్ మేరకు కొత్తగా కొన్ని స్క్రీన్స్ యాడ్ చేసినట్లు టీమ్ ప్రకటించింది.

## ఈ సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక ట్విస్ట్..: నిఖిల్

**తన తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' గురించి నిఖిల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ప్రతి పది నిమిషాలకు ఒక ట్విస్ట్ ఉంటుందన్నారు.**



'స్వామిరారా', 'కేశవ' తర్వాత హీరో నిఖిల్, డైరెక్టర్ సుధీర్ వర్మ కాంబినేషన్లో రూపొందిన సినిమా 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. నిఖిల్ సరసన రుక్మిణీ వసంత్, దివ్యాంశ కౌశిక్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం నవంబరు 8న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈసందర్భంగా ఓ ఇంటర్వ్యూలో నిఖిల్ మాట్లాడుతూ ఈ చిత్రంపై తనకు నమ్మకముందన్నారు. తాజాగా ఈ చిత్రం ప్రీమియర్ను ప్రదర్శించగా మంచి స్పందన వచ్చిందని తెలిపారు. "స్వామిరారా'లో మిస్ అయిన ప్రేమికుడిని 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'లో చూస్తారు. ప్రేక్షకులు మరో ప్రపంచంలోకి వెళ్తారు. ఈ సినిమాలో ప్రతి పది నిమిషాలకు ఒక ట్విస్ట్ ఉంటుంది. క్లైమాక్స్ ట్విస్ట్ను ఎవరూ ఊహించలేరు. ఈ కంటెంట్పై పూర్తి నమ్మకంతో ఈ మాటలు చెబుతున్నా" అని నిఖిల్ ధీమా వ్యక్తంచేశారు. 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'ను ఎప్పుడు తీశానో అని చాలామందికి సందేహం ఉందని నిఖిల్ అన్నారు. 'కార్తికేయ' సినిమా తర్వాత దీన్ని తెరకెక్కించాలని అనుకున్నట్లు చెప్పారు.. 'స్పై' కంటే ముందు రావాల్సిన సినిమా ఇదన్నారు. తాను ప్రస్తుతం చేస్తోన్న సినిమా మధ్యలో ఒక షెడ్యూల్ బ్రేక్ రావడంతో దీన్ని రూపొందించినట్లు చెప్పారు. ఇక ప్రస్తుతం నిఖిల్ 'స్వయంభూ'లో నటిస్తున్నారు. భరత్ కృష్ణమాచారి రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. సంయుక్తా మేనన్ కథానాయిక. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. ఈ సినిమాలో మరో నాయికగా నభా నటేష్ కనిపించనున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ చిత్రంలో నిఖిల్ ఓ యోధుడిగా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం తను ఇప్పటికే మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.

## 'నిన్నే పెళ్లాడతా'లో ఆ పాటకు నేను వీరాభిమానిని: ప్రభాస్

**'నా ఉచ్ఛ్వాసం కవనం' కార్యక్రమంలో సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు నటుడు ప్రభాస్. తనకు ఇష్టమైన పాటల గురించి ప్రస్తావించారు.**



ఈటీవీలో ప్రసారమవుతోన్న 'నా ఉచ్ఛ్వాసం కవనం' కార్యక్రమానికి ప్రభాస్ అతిథిగా హాజరైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమం రెండో పార్ట్ తాజాగా విడుదలైంది. ఇందులో ప్రభాస్ తనకు ఇష్టమైన పాటలు గురించి పంచుకున్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.'సిరివెన్నెల సినిమాలోని 'విధాత తలపున ప్రభవించినది..' పాట చాలా గొప్పగా ఉంటుంది. 'సరసుస్వర సుర ఝరీగమనమౌ సామవేద సారమిది' లైన్స్ అంత బాగా ఎలా రాశారో.. సిరివెన్నెల గారు పెన్ను పెట్టగానే ఇలాంటి గొప్ప లిరిక్స్ వచ్చేస్తాయేమో. అలాగే 'నిన్నే పెళ్లాడతా' సినిమాలో 'కన్నుల్లో నీ రూపమే' పాట అంటే నాకు చాలా ఇష్టం. ఆ పాట చరణంలో వచ్చే లైన్స్కు (తల వంచుకొని నేను తెగ ఎదురుచూశాను..) నేను వీరాభిమానిని. ప్రతి తరానికి సరిపోయేలా రాయడం సిరివెన్నెల గొప్పతనం. సాహిత్యానికి ప్రాధాన్యం ఉన్న పాటలు రాసిన ఆయనే.. 'శివ' సినిమాలో బోటనీ పాఠముంది లాంటి టీజింగ్ సాంగ్ రాశారు. ఈ సినిమా వచ్చినప్పుడు నేను ఐదో తరగతి చదువుతున్నా. ఎక్కడికి వెళ్లినా ఈ పాటే పాడేవాడిని. ఇది సిరివెన్నెల గారు రాశారని తెలిసి ఆశ్చర్యపోయాను. అప్పట్లో ఇది సంచలనం సృష్టించింది" అని చెప్పారు. "సీతారామశాస్త్రికి పాటల్లో ప్రయోగాలు చేయడం ఇష్టం. ఆయన పేరు చెప్పగానే ఎన్నో పాటలు గుర్తొస్తాయి. 'చక్రం' సినిమాలో జగమంత కుటుంబం పాట మొదట గుర్తొస్తుంది. అలాగే 'అంకురం'లో ఎవరో ఒకరు ఎప్పుడో ఒకరు కూడా నాకు నచ్చుతుంది. వినడానికి చాలా సింపుల్గా ఉన్నా.. లోతైన భావం ఉన్న పాట ఇది. చిన్న పిల్లలకు కూడా అర్థమయ్యేలా రాశారు. 'గమ్యం'లో ఎంతవరకు ఎందుకొరకు కూడా బాగుంటుంది. 'గాయం' సినిమాలో నిగ్గదీసి అడుగు.. పాటలో సమాజంపై ఆయన తపన కనపడుతుంది. శ్రీశ్రీ గారు, సిరివెన్నెల గారు రాసినవి వింటుంటే ఒకరకమైన ఉద్వేగానికి గురవుతాం. ఎంతోమందిలో శాస్త్రిగారి పాటలు స్ఫూర్తినింపాయి' అంటూ సిరివెన్నెల పాటల్లో గొప్పతనాన్ని వివరించారు. ఇక ఈ కార్యక్రమంలో వ్యాఖ్యత పార్థు మాట్లాడుతూ.. శాస్త్రిగారు రాసిన పాటలు విని ఎంతోమంది ఆత్మహత్య చేసుకునే వాళ్లు కూడా కొత్త జీవితాన్ని ప్రారంభించారన్నారు. 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి' పాట తనలో మార్పు తెచ్చిందని ఓ వ్యక్తి అమెరికా నుంచి శాస్త్రిగారికి లెటర్ రాశారని గుర్తుచేసుకున్నారు. ఆ లిరిక్స్ అంత పవర్ఫుల్గా ఉంటాయని వివరించారు. దీనికి ప్రభాస్ స్పందిస్తూ.. సీతారామశాస్త్రి రాసిన ఎన్నో పాటల్లోని లిరిక్స్ స్ఫూర్తినిస్తా-యన్నారు.

## లైఫ్ స్టైల్

## అబ్బాయిలూ మీ కోసమే ఈ డ్రెస్సింగ్ టిప్స్.. ఫాలో అయితే అమ్మాయిలు చూపు తిప్పుకోలేరు..

**కేవలం అమ్మాయిలు మాత్రమే కాదు.. అబ్బాయిలు కూడా డ్రెస్సింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అయితే, అమ్మాయిలతో పోలీస్తే అబ్బాయిలు ఈ విషయంలో కాస్త వెనుకంజలో ఉన్నారు.**

అందంగా, స్టైలిష్గా కనిపించేందుకు నేటి యు-వత ఎన్నో తంటాలు పడుతున్నారు. ఫ్యాషన్ సెన్స్ బాగా పెరిగింది. కేవలం అమ్మాయిలు మాత్రమే కాదు.. అబ్బాయిలు కూడా డ్రెస్సింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అయితే, అమ్మాయిలతో పోలీస్తే అబ్బాయిలు ఈ విషయంలో కాస్త వెనుకంజలో ఉన్నారు. అమ్మాయిలు అందంగా కనిపించడానికి రకరకాల ఫ్యాషన్ డ్రెస్సులు ధరిస్తారు. అదే, అబ్బాయిలు బాడీ పెంచడంపై దృష్టి పెడతారు. కానీ, డ్రెస్సింగ్ విషయంలో మాత్రం అమ్మాయిలతో పోలిస్తే అబ్బాయిలకు ఫ్యాషన్ సెన్స్ తక్కువనే చెప్పాలి. చాలా మంది అబ్బాయిలు ఏ డ్రెస్సులు పడితే అవి వేసేస్తారు. కానీ, ఈ రోజుల్లో అందంగా, స్టైలిష్గా ఉన్నవారికే డిమాండ్ ఎక్కువ. డ్రెస్సింగ్ విషయంలో అబ్బాయిలు గందరగోళంగా ఉంటారు. అయితే, స్టైలిష్తో పాటు కూల్గా కనిపించాలంటే.. అబ్బాయిలు కొన్ని చిట్కాలు ఫాలో కావాల్సిందే. అబ్బాయిల కోసం ఫ్యాషన్ నిపుణులు చెప్పిన కొన్ని చిట్కాలు ఇక్కడ తెలుసుకుందాం.





### శరీర ఆకృతి..



లావుగా ఉన్న వ్యక్తులు టైట్ దుస్తుల్ని ఎంచుకోవద్దు. ఎందుకంటే టైట్ దుస్తుల్లో వారు పొట్ట బయటకు కనిపించే అవకాశం ఉంది. అందుకే మీ శరీర ఆకృతి బట్టి.. డ్రెస్సులు సెలెక్ట్ చేసుకోండి. సన్నగా ఉన్న అబ్బాయిలు కూడా దుస్తుల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉండాలి. మీరు వదులు బట్టలు సెలెక్ట్ చేసుకోకండి. ఇలా చేయడం వల్ల వికారంగా కనిపించే అవకాశం ఉంది.

### దుస్తులకు తగ్గ షూస్ ఎంపిక



కేవలం దుస్తులు ధరిస్తే సరిపోదు. దానికి తగ్గ యాక్ససరీస్ కూడా ఉండాలి. ముఖ్యంగా షూస్ దుస్తులకు సరిపోయేలా ఉండాలి. జిమ్ వేర్ ధరిస్తే.. దానికి తగ్గ స్పోర్ట్ షూస్ ధరించండి. స్టైల్గా కనిపించడం కోసం డిఫరెంట్ స్నీకర్స్ వాడండి. బూట్లు మిమ్మల్ని చాలా స్టైలిష్గా కనిపించేలా చేస్తాయి. కాబట్టి సరైన షూస్ ఎంచుకోండి.

### బట్టల కలర్..



అబ్బాయిలు కూల్గా కనిపించాలంటే బట్టల రంగుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఒకే రకమైన కలర్స్ వేస్తే అంతగా సూటవుతుంది. జీన్స్ ప్యాంట్ వేస్తే తనకి కాంట్రాస్ట్ కలర్ చొక్కా ధరించడానికి ట్రై చేయండి. అలాగే షర్ట్, టీ షర్ట్స్ కలర్ బట్టి.. కాంట్రాస్ట్ కలర్ ప్యాంట్స్ సెలెక్ట్ చేసుకోండి. ఏ కలర్ బట్టలు వేసుకుంటే మీరు బాగా కనిపిస్తారో.. ఒకటికి పది సార్లు చెక్ చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు.

### సరైన సైజ్..



సరైన సైజ్ డ్రెస్సులు సెలెక్ట్ చేసుకోవడంపై కూడా దృష్టి పెట్టాలి. సైజ్ ఎక్కువ ఉన్న బట్టలు వేసుకుంటే మీరు లావుగా కనిపిస్తారు. అందుకే స్లిమ్ ఫిట్ సైజుపై దృష్టి పెట్టండి. దుస్తులు కొనేటప్పుడే.. ఒకటి రెండు సార్లు మీ సైజు సరిచూసుకోండి. అంతేకాకుండా టైట్ దుస్తుల్ని కూడా సెలెక్ట్ చేసుకోవద్దు. ఇలా చేయడం వల్ల మీకు ఇబ్బందిగా అనిపించవచ్చు. టైట్ దుస్తుల్లో కొందరి లుక్ అస్సలు బాగోదు. అందుకే.. అసౌకర్యంగా ఉండే దుస్తుల్ని ఎంచుకోవద్దు.



### జుట్టు, గడ్డం..



అబ్బాయిల అందంలో జుట్టు, గడ్డం కూడా కీ రోల్ ప్లే చేస్తాయి. ఎంత స్టైలిష్ బట్టలు వేసుకున్నా.. హెయిర్ స్టైల్ సరిగ్గా లేకపోతే.. మీ లుక్ అంతా పాడైపోతుంది. స్టైల్, కూల్ లుక్ కోసం మీ హెయిర్ స్టైల్ కీలకం. అంతేకాకుండా గడ్డం కూడా స్టైల్ లుక్ ఇస్తుంది. కొందరు గడ్డం ఉండే చాలా స్టైల్గా కనిపిస్తారు. కొందరు గడ్డం లేకపోతే బాగుంటారు. అందుకే హెయిర్ స్టైల్, గడ్డం విషయంలో జాగ్రత్తలు తీసుకోండి.

### వీ- నెక్ టీ షర్ట్స్..



టీ షర్ట్స్ వేసుకున్నప్పుడు కాలర్ నెక్ కాకుండా.. వీ నెక్ డ్రెస్సుల్ని ఎంపిక చేసుకోండి. ఇవి మిమ్మల్ని స్లిమ్గా కనిపించడంలో సాయపడతాయి. అంతేకాకుండా టీ షర్ట్ పొడువు మిమ్మల్ని లావుగా చూపిస్తుంది. అందుకే.. టీ షర్ట్ పొడువు కూడా చాలా ముఖ్యం. మీ హైట్కి తగ్గ టీ షర్ట్స్ ఎంపిక చేసుకోండి.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.